

### ఆన్‌లైన్‌లో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల శిక్షణ

కాచిగూడ, నవంబర్ 28: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సాయి శ్రీమాన్ రెడ్డి తెలిపారు. కాచిగూడలో గురువారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్, సెక్యూరిటీ విభాగం, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో 2 నుంచి 6 నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లమా, పీజీ, ఇంజినీరింగ్ పూర్తిచేసిన యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 95058 00050, www.nationalskillacademy.in లో సంప్రదించవచ్చని కోరారు.

# పోలీసులే ఆక్రమిస్తే..?

## ఫుట్‌పాత్‌లను ఆక్రమించేస్తున్న ఖాకీలు

- పలు ఠాణాల ముందు ఫుట్‌పాత్‌లు మాయం
- పేద మధ్య తరగతిపైనే రోప్ ఫోకస్..!
- హడావిడితోనే సరిపెడుతారా? పూర్తిస్థాయి ప్రక్షాళన చేస్తారా?

సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌లు, క్యారేజ్ వేలను ఆక్రమిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించడమే కాకుండా.., పాదచారులు ఫుట్‌పాత్‌పై నడిచేందుకు వీలు లేకుండా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ ఆబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎంక్రోచ్‌మెంట్స్)ను ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రారంభించారు. బయట ఫుట్‌పాత్‌లను క్లీన్ చేయడానికి ముందే, తమ ఠాణాల ముందు ఫుట్‌పాత్‌లు సరిగ్గా ఉన్నాయా? ఆ ఫుట్‌పాత్‌లపై ప్రజలు నడిచేందుకు అవకాశముందా? ఠాణాలకు వచ్చే వారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేస్తున్నారు? పార్కింగ్ సౌకర్యం ఉందా? అనే విషయాలు కూడా ఆలోచించాల్సిన అవసరముంది. అయితే, నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఠాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేసే సౌకర్యం చాలా వాటికి లేదు. దీంతో చాలా ఠాణాల ముందు వాహనాలను రోడ్డుపై ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్ చేస్తుంటారు. ఇటూ శాంతి భద్రతలు, అటూ ట్రాఫిక్ ఠాణాల ముందు ఈ పరిస్థితి ఉంది. చాలా పోలీస్‌స్టేషన్లలో వెనుక కొంత స్థలం పార్కింగ్ కోసం ఉన్నా, చాలా మంది బయటే వాహనాలు పార్కు చేస్తుంటారు. మరికొన్ని చోట్ల ఠాణా సిబ్బంది తమ వాహనాలను లోపల ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో పార్కు చేసుకుంటే, ఠాణాకు వచ్చిన వారితో ఠాణా ముందు రోడ్డు వాహనాలతో నిండి ఉంటుంది. ఇలా రద్దీలేని ప్రాంతాలే కాకుండా నిత్యం రద్దీగా ఉంటే రోడ్లపై ఉన్న ఠాణాల వద్ద పరిస్థితి ఇది.

### నడిచే జాగే ఉండదు...!

పంజాగుట్ట చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు ఒక వైపు పూర్తిగా ఫుట్‌పాత్‌ను పోలీసులు ఆక్రమించేశారు. రాంగ్ పార్కింగ్‌లలో వాహనాలు నిలిపితే ఆయా వాహనాలను క్రేన్ సహాయంతో తెచ్చి ఇక్కడే పార్కు చేస్తుంటారు. ఈ చౌరస్తాలో ఫుట్‌పాత్ పూర్తిగా ఆక్రమించేశారు. ఇదే ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని గమనించడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. మధురానగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మారేడ్‌పల్లి, లంగర్‌హౌస్,



పంజాగుట్ట ట్రాఫిక్ ఠాణా ముందు ఫుట్‌పాత్‌పై ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసిన వాహనాలు

హుమాయూన్‌నగర్, హబీబ్‌నగర్, ఆసిఫ్‌నగర్ ఇలా పలు లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీగా ఉండే చాదర్‌ఘాట్ చౌరస్తాలో ఠాణా ముందు జాగలేదు. పక్కనే వాహనాలను పార్కు చేస్తారు. ఇక్కడకు వచ్చిపోయే వారు, తరుచు పోలీసులు రోడ్డు పక్కన వాహనాలను పార్కు చేస్తుండటంతో అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. ఇలా నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల వద్ద పార్కింగ్ స్థలాలు సరిగ్గా లేకపోవడంతో వాహనాలన్ని ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే పెడుతున్నారు. హైదరాబాద్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయం, ప్రస్తుత సీసీఎస్ భవనం వద్ద కూడా సరైన పార్కింగ్ సౌకర్యం లేదు. ఇక్కడ వాహనాలన్ని నిజాం కాలేజీ గోడకు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తుంటాయి. చౌరస్తాలో ఉన్న ఆలయం ముందు ఉన్న ప్లేస్ అంతా పార్కింగ్‌కే ఉపయోగిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చే వాహనాలతో బీఆర్‌కే భవన్ వైపున్న రోడ్డంతా జామై ఉంటుంది. వీటికి తోడు బడా హోటల్స్, బార్లు, మద్యం దుకాణాల ముందు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతంలో ఉన్న పబ్‌ల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనాలన్ని రోడ్లపై బారులు తీరి ఉంటాయి. ఇక్కడ రాత్రి వేళల్లో నడిచేందుకే కాదు.., సాధారణ వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు అనేకం ఉంటాయి.

### ఏమి చేస్తారు...!

నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన రోప్ మంచి కార్యక్రమమే. ఫుట్‌పాత్ వ్యాపారాలు చేయడం ఒక మాఫియా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో చాలా చోట్ల ఫుట్‌పాత్‌లు నిండిపోయాయి. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లను స్థానికంగా ఉండే నాయకులు కబ్జా చేస్తూ దానిని చిరు వ్యాపారులకు కిరాయికి ఇస్తూ నెలవారి కిరాయి వసూలు చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలలో ఫుట్‌పాత్ ఆక్రమణలు ప్రధానమైందే. కాని, పోలీస్ ఠాణాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏ మేర పార్కింగ్ సౌకర్యాలున్నాయి? అక్కడకు వచ్చే వారు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారా? అనే విషయాలపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరముంది. ఆపరేషన్ రోప్ అంటూ హడావిడి చేస్తూ స్థానిక పోలీసులు అక్కడక్కడ అధికారుల మెప్పు పొందేందుకు తాపత్రయ పడుతుంటారు. పూర్తిస్థాయిలో ఆయా ఠాణాల పరిధిలో రోప్‌ను అమలు చేస్తే ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుందని నగరవాసులు సూచిస్తున్నారు.

### కిమ్స్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

బేగంపేట్ నవంబర్ 28: సికింద్రాబాద్ బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను గురువారం తొలగించారు. బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు నిర్వహించారు. బేగంపేట్ కిమ్స్, ఆసుపత్రి రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలైన బడ్డీ కొట్లు, చాయ్‌బండి, టిఫిన్ బండ్లు ఇతర చిరు వ్యాపారాలను పూర్తిగా తొలగించారు. అలాగే, పార్కులైన్ సెంటర్ నుంచి ప్యారడైజ్ వరకు ఆక్రమణలను తొలగించారు. ఈ తొలగింపు కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు. రోడ్డును, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ ఆటంకాలు కలిగిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.



కిమ్స్ ఆసుపత్రి రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన బండ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసిన శామీర్‌పేట మాజీ వార్డు సభ్యుడు నవీన్ ముదిరాజ్
– శామీర్‌పేట, నవంబర్ 28;

### నూనె గింజల నూతన ఆవిష్కరణలు మరిన్ని అవసరం: ఐసీఏఆర్ డీజే డా.శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 28: దేశ వ్యాప్తంగా నూనె గింజల సాగు మరింత అవసరమని, అందుకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని జాతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఐఐఓఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టీఆర్ శర్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ జాతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం సమావేశం మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన నూతన నూనెగింజల రకాల ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.మాథూర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా జీవ నియంత్రణ సాంకేతికత రంగంలో వివిధ ట్రైకోడెర్మా, బీటీ సంబంధింత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో దేశ వ్యాప్తంగా మనకు మంచి పేరు లభించిందన్నారు. ఈ సాంకేతికతను దేశ వ్యాప్తంగా దాదాపు 60కి పైగా పరిశ్రమలకు అందజేశారన్నారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక ఉష్ణోగ్రత, బెట్ట పరిస్థితులకు నుంచి కాపాడుతున్నాయన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు డా.కేఎస్వీ పూర్ణ చంద్రిక, డా. ఆర్డీ ప్రసాద్ కృషి అభినందనీయమన్నారు. వీటి వినియోగాన్ని రైతు స్థాయిలో పెంచేందుకు కృషి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డా.శర్మ తదితరులు

## అనతి కాలంలోనే మెట్రోకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

- ఎల్ అండ్ టీ సీఈఓ ఎండీ కేవీబీ రెడ్డి
- ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో మెట్రో ఏడో వార్షికోత్సవం

సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో అనతి కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును సొంతం చేసుకుందని, ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టు నిర్మించిన ఘనత ఎల్ అండ్ టీకి దక్కిందని ఎల్ అండ్ టీ సీఈఓ ఎండీ కేవీబీ రెడ్డి అన్నారు. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో వార్షిక వేడుకలను అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో గురువారం నిర్వహించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడేళ్ల కాలంలో దిగ్విజయంగా మెట్రో సేవలతో అందరికీ చేరువయ్యామన్నారు. కేవలం ఇదొక ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే



కాదని, హైదరాబాద్ ఎకనామిక్ గ్రోత్‌లోనూ కీలక పాత్ర పోషించిందన్నారు. సామాజిక అభివృద్ధితో పాటు, పర్యావరణ సుస్థిరత సాధ్యమైందన్నారు. అదే విధంగా నగరంలో ట్రాఫిక్ సమస్య అనూహ్యంగా తగ్గిందని, దీంతో గాలి నాణ్యత పెరిగిందన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి, మరెన్నో సమస్యలకు ఇంజనీరింగ్ నైపుణ్యాలతో పరిష్కారం చూపిన ఏకైక పీపీపీ వెంచర్‌గా మెట్రో నిలుస్తుందని ఎల్ అండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన మెట్రో హైదరాబాద్ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసిందని, సుస్థిర అభివృద్ధిలో తమ భాగస్వామ్యం కూడా ఉందన్నారు. కాగా, ఏడేళ్లలో సగటున 4.75 లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చామని, అత్యధికంగా 5.63 లక్షల మంది ప్రయాణించగా, ఇప్పటి వరకు 63.5 కోట్ల మంది మెట్రో వినియోగించుకున్నారు. నిత్యం 25,600 కిలోమీటర్లు ప్రయాణిస్తూ, 184 మిలియన్ లీటర్ల శిలాజ ఇంధనాలను పొదుపు చేశామన్నారు. దీంతో 424 మిలియన్ కిలోల కర్బన ఉద్గారాలు తగ్గినట్లుగా పేర్కొన్నారు. అదే విధంగా మెట్రో డిపోలు, స్టేషన్లలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ స్టేషన్లతో 12 శాతం మెట్రో విద్యుత్ అవసరాలు తీరుతున్నట్లుగా ఎల్ అండ్ టీ వర్గాలు పేర్కొన్నాయి.

## జోస్ అలుక్కాస్ బంపర్ డ్రా విజేతకు కారు..



సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): జోస్ అలుక్కాస్ సంస్థ 60వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రీజియన్ బంపర్ లక్కీ డ్రాలో గెలుపొందిన విజేత కేఎస్ దుర్గాప్రసాద్‌కు గురువారం ఎంజీ ఆస్టర్ కార్‌ను మేనేజింగ్ డైరెక్టర్ పాల్ అలుక్కా అందజేశారు. ఈ సందర్భంగా పాల్ అలుక్కా మాట్లాడుతూ, తమ సంస్థ పరంగా ఇలాంటి బహుమతిని తమ కస్టమర్‌కు ఇవ్వడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో మరిడన్ని ఇలాంటి ఆఫర్లు కల్పిస్తామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ లెనో, స్టోర్ మేనేజర్ షానోజ్ పాల్గొన్నారు.

## నేడు సెయింట్ జార్జెస్ స్కూల్ వార్షికోత్సవం

- సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్ 190 ఏండ్ల వేడుక
- వెల్లడించిన పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం




వివరాలను వెల్లడిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రిన్సిపాల్ రుత్ లజ్వంతి, జె.మార్తా నిస్సీ డానియేల్

అబిడ్స్, నవంబర్ 28: నిజాం కాలంలో ప్రారంభమైన అతి పురాతనమైన సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ 190 సంవత్సరాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రిన్సిపాల్ రుత్ లజ్వంతి, జె.మార్తా నిస్సీ డానియేల్‌లు పేర్కొన్నారు. అబిడ్స్‌లోని పాఠశాల ఆవరణలో వారు మాట్లాడుతూ 1834వ సంవత్సరంలో ది హైదరాబాద్ రెసిడెన్షియల్ స్కూల్ పేరిట కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన తమ పాఠశాల నేడు 4,300 మంది విద్యార్థులతో కొనసాగుతోందన్నారు. నిజాం కాలం నాటి నుంచి నేటి వరకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాలలో రాణించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. 29వ తేదీన జరిగే వేడుకలలో పూర్వ విద్యార్థులు సైతం పాల్గొంటున్నారని వివరించారు.

### విద్యనభ్యసించిన ప్రముఖులు..

సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థులు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పలు రంగాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రిన్సిపాల్‌లు రుత్ లజ్వంతి, జె.మార్తా నిస్సీ డానియేల్‌లు వెల్లడించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుతో పాటు అరుణ బహుగుణ, జేడీ చక్రవర్తి వంటి ప్రముఖులు ఇక్కడ చదివిన వారేనని, ఇంకా అనేక మంది రాజకీయ, ఇతర రంగాలలో ప్రముఖంగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

## గ్రేటర్@29.0 డిగ్రీలు



సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతుండటంతో గ్రేటర్‌లో చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29.0 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 16.2 డిగ్రీలు, గాలిలో తేమ 36 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# సంచార జాతులు సంఘటితం కావాలి

- స్వాతంత్రం వచ్చినా.. ఆ వర్గాలకు ఫలాలు దక్కలేదు
- 90 శాతం కులాలు చట్ట సభల ముఖం చూడలేదు
- ఓట్లు వేసేది మనం.. రాజ్యాధికారం వాళ్లదా..?
- దరఖాస్తులు ఇచ్చి... దందాలు పెట్టడం మానండి
- హక్కుల కోసం అవసరమైతే ఆమరణ దీక్ష చేపట్టండి
- సంజాచర జాతుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో అభివాదం చేస్తున్న మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, వకుళాభరణం, తాడూరి శ్రీనివాస్ తదితరులు.

ఖైరతాబాద్, నవంబర్ 27: స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు గడుస్తున్నాయని, కానీ, నేటికీ ఆ ఫలాలు దక్కని వర్గాలు సంచార జాతులని, సంఘటితమైతే తప్ప రాజ్యాధికారం దక్కదని వక్తలు అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ నుంచి నిన్నటి కేసీఆర్ వరకు హక్కుల కోసం ఆమరణ దీక్షలు చేపట్టారని, వారి స్ఫూర్తితో సంచార జాతులు ఆమరణ దీక్ష చేపట్టి రాజ్యాధికారం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సంచార సంఘం అధ్యక్షులు తిపిరిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ శాసన మండలి సభా పక్ష నేత, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని సంచార వర్గాల ఆస్తులన్నీ లెక్కిస్తే ఓ సంపన్నుడి కంటే తక్కువగా ఉంటాయని, అలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో ఆ జాతులు జీవించడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. ఓట్లు వేసేది మనం.. గద్దె మీద కూర్చోబెట్టిది మనం... తిరిగి వారికే దరఖాస్తులు ఇచ్చి.... దండాలు పెట్టడం ఆనవాయితీగా మారిందని, ఇకనైనా ఈ పరిస్థితి మారాలన్నారు. దేశంలో నేటికీ 90 శాతం కులాలు చట్టసభల ముఖాలే చూడలేదని, అందులో 5 నుంచి 10 శాతం మందికి చట్టసభలు ఉన్నాయన్న విషయమే తెలియదన్నారు. సంచార జాతులు జనాభాలో 12 శాతం ఉన్నారని, కేవలం 4, 5 శాతానికే రాజ్యాధికార మార్పిడి జరుగుతుందని, మన సత్తా మనం తెలుసుకుంటే రాజ్యాధికారం ఎంతో దూరంలో ఉండదన్నారు. సంచార జాతులకు అన్ని రకాలుగా బీఆర్‌ఎస్ అండగా నిలబడుతుందన్నారు.

### దహన సంస్కారాలకు భూమే లేదు: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సంచార జాతుల్లో ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాలకు ఇంచు భూమి లేదని, అలాంటి పరిస్థితుల్లో వారు జీవిస్తున్నారని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు వారికి రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించానని గుర్తు చేశారు. ఓట్లు వేసే సమయం వచ్చే సరికి మనల్నీ చిన్నాభిన్నం చేస్తారని, మనమే వారికి ఓట్లు వేస్తామని, సీటులో కూర్చోబెడుతామని, ఏదైనా కావాలంటే లైన్‌లో నిలబడి అడుక్కుంటామని, ఈ పరిస్థితి మారాలన్నారు. ముఖ్యమంత్రి ఒక్క రోజైనా సంచారజాతులకు కేటాయించి వారి స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. బీసీ వర్గీకరణ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందులో సంచార జాతులకు 10% రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. సంచార జాతుల్లో వంద శాతం కనీసం సర్పంచ్‌లు అయిన దాఖలాలు లేవన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పా టు చేసిందని, అత్యంత వెనుకబడిన వారికి సముచిత స్థానం కల్పించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంచార జాతులను ఆదుకోవాలని, వారికి అన్ని హంగులతో ప్ర త్యేక ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి డిగ్రీ వరకు ఉచితంగా విద్యనందించాలన్నారు. నేడు హాస్టళ్లలో దుర్భరమైన పరిస్థితులున్నాయని, ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. ఇటీవల 250 మందికిపైగా ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రుల్లో చేరారన్నారు.

### సంచార జాతుల వివరాలను సేకరించారా?: వకుళాభరణం

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన 92 నుంచి 93 శాతం పూర్తయ్యిందని చెబుతున్నారని, అసలు సంచార జాతుల వివరాలను సేకరించారా? అని ప్రశ్నించారు. సమగ్ర కులగణన ప్రశావళిలో అసలు డినోటిఫైడ్ ట్రైబ్ అనే కాలమే లేదన్నారు. అలాంటప్పుడు వారి లెక్కలు ఎలా తెలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు వంద శాతం ఎలా పూర్తవుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన డిక్లరేషన్, రిజర్వేషన్ల పెంపు, కార్పొరేషన్లు, డైరెక్టర్లు, చైర్మన్ పదవుల హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు.

### ఎంపీలు, ఎమ్మెల్యేలకు సంచార జాతుల కులాలే తెలియవు: తాడూరి

ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర కుల గణనలో కులం కాలమ్‌ను పెన్సిల్‌తో నింపుతున్నారని, అది ట్యాంపరింగ్ అయితే మనకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంచార జాతుల కులాలే తెలియని తరుణంలో, మనం ఓట్లు వేసి వారిని గెలిపించుకుంటున్నామని అన్నారు. కేంద్రంలో సంచార జాతుల బోర్డు కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా ప్రకటిస్తే వారికి రుణాలు దక్కుతాయన్నారు.

### అన్ని రంగాల్లో వెనకబడ్డ సంచారులు: చిరంజీవులు

బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ రాజ్యాధికారం లేకపోవడం వల్ల సంచారజాతులు అన్ని రంగాల్లో వెనుకబడిపోయాయన్నారు. ముందుగా సంచార జాతులు విద్యా పరంగా అభివృద్ధి సాధించాలన్నారు. బీసీల పోరాటాల వల్లే నేడు ప్రభుత్వం సమగ్ర కుల గణన చేపట్టిందని, అదే స్ఫూర్తితో సంచార జాతులు పోరాడి సాధించుకోవాలన్నారు.


### ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కేటాయించాలి: జాజుల

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ త్వరలో జరుగబోయే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎంబీసీ, సంచార జాతుల నుంచి ఒక్కొక్కరికి కేటాయించాలన్నారు. సంచార జాతులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. సంచార జాతుల సత్తా చాటేందుకు మహా సంగ్రామం పేరుతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ, బీసీ సంఘాలు వారికి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తాయన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ మురళీ మనోహర్, బీసీ సమాజ్ నాయకులు బత్తుల సిద్ధేశ్వర్, తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఒ.నరేందర్, విశ్రాంత డీఎస్పీ గంగాధర్, సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు పిడికిలి రాజు, వంశరాజ్, పూసల జంగమ, మందుల, పెద్ద అమ్మల సంఘాల నాయకులు మురళీకృష్ణ, కోల శ్రీనివాస్, విశ్వేశ్వరయ్య, రమేశ్, రాములు పాల్గొన్నారు.

# దళితుల విభజన.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బైరు రమేశ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 28: అగ్రవర్ణాలు ఏకమై దళితులను విభజించాలని చూడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బైరు రమేశ్ తెలిపారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 25న భద్రాచలం నుంచి ప్రారంభమైన మాలల మహా పాదయాత్ర గురువారం ఘట్‌కేసర్ చేరుకుంది. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మైరు రమేశ్ తదితరులు

ఆయన మాట్లాడుతూ, అగ్రవర్ణాలు దళితుల్ని విభజించి వారిని రాజ్యాధికారం నుంచి దూరం చేయటం వల్ల ఆధిపత్యాన్ని కొనసాగించవచ్చని దళితుల్ని కేవలం ఓటు బ్యాంకుగా చూసే కుట్రలు పన్నటంలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం దళితులకు అందించిన పథకాలు ఎవరు ఎక్కువ లబ్ధి పొందారో ప్రభుత్వం లెక్కలు చెబితే తెలుస్తుందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, గురుకుల సీట్లు ఎవరు ఎక్కువ వినియోగించుకున్నారో శాస్త్రీయమైన ఆధారాలతో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. చారిత్రక సత్యాన్ని ప్రజా క్షేత్రంలో నిలపడానికి, రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ మాలల మహా పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. డిసెంబర్ 1న నగరంలో జరిగే మాలల సింహగర్జన మహా సభలో అధిక సంఖ్యలో మాలలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ రావు, ఉపాధ్యక్షుడు రవి కాంత్, కన్వీనర్ పరశురాం, నాయకులు ఆంజనేయులు, రఘు, మల్లేశ్, మురళీమోహన్, మేకల దాసు, పద్మారావు, ఆనంద్, వీరేశం, కిరణ్, బద్దం కుమార్, మేకల నర్సింగ రావు, మహిళలు పాల్గొన్నారు.